సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

## సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): లోక్ సభ ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం 12ని వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ, ఇందుకు గాను సీఈఓ కార్యాలయం వెబ్‌సైట్ నందున్న పోస్టల్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో ప్రతి జిల్లా అధికారి తమ కార్యాలయ సిబ్బందితో సహా తమ వివరాలను పొందుపరిచే బాధ్యత నోడల్ అధికారులదేనని అన్నారు. మే 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్, పోలీస్ సిబ్బందికి సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ పక్రియను అత్యంత పకడ్బందీంగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎండిన ఆకులతో ఆర్గానిక్ ఎరువు కేంద్రం

### కంపోస్టింగ్ ప్లాంట్‌ను సందర్శించిన రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): ఎండిన ఆకులను అధిక పోషకాలు గల మట్టి కండీషనర్ (ఆర్గానిక్ ఎరువు)గా మార్చే యాక్సిలరేటెడ్ ఎనరోబిక్ కంపోస్టింగ్ ప్లాంటును గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సందర్శించారు. మ్యాపిల్ టౌన్ విల్లాల్‌లో ఐఐసీటీ ఈ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఈ టెక్నాలజీ ద్వారా మ్యాపిల్ టౌన్ నివాసులు నెలకు సుమారు 10 టన్నుల సాయిల్ కండీషనర్‌ని తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను సందర్శించి అక్కడ గేటెడ్ కమ్యూనిటీ నుంచి వచ్చే మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్శనలో ఏసీ శివ కుమార్ నాయుడు, డాక్టర్ ఎన్.సునందారాణి, జెడ్సీ స్నేహ శబరీష్, సీఎస్ఐఆర్-ఐఐసీటీ బృందం డా.శ్రీనివాస్‌రెడ్డి, డా.గంగాగ్ని రావు, డా.శైలజ, డా.రాజేందర్ రెడ్డి, ఇతర వైద్యులు వెంకట మోహన్, సమీనా బేగం, ఆనంద్ కుమార్, విజయలక్ష్మి, నవీన్ కుమార్, ప్రసాద్, మ్యాపిల్ టౌన్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం

### మేడ్చల్ జిల్లాలో 40 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అంచనా

### 12 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

మేడ్చల్, మార్చి 28(నమస్తే తెలంగాణ): ధాన్యం సేకరణకు పౌర సరఫరాల శాఖ ప్రణాళికను సిద్ధం చేస్తుంది. ఏప్రిల్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయన్నా అంచనా మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. యాసంగి సీజన్‌లో వరి పంటను 13, 500 వందల ఎకరాలలో రైతులు సాగు చేశారు. దీంతో పండిన ధాన్యాన్ని రైతులు అవసరాల నిమిత్తం ఉంచుకోగా, 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో 12 కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభించి రైతులు ధాన్యం పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. గ్రేడ్ వన్ క్వింటాలుకు మద్దతు ధర రూ.2,203, కామన్ రకానికి క్వింటాలుకు రూ.2,183 అందించనున్నారు. జిల్లాలో ప్రతాప సింగారం, ఎదులాబాద్, మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, మేడ్చల్, డబిల్‌పూర్, కీసర, అలియాబాద్, శామీర్‌పేట్ కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గన్ని బ్యాగులను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించనున్నారు. కాగా, త్వరలో జరగనున్న ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగి విజయవంతమైనట్లు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

## విద్యుత్ ఉద్యోగిపై దాడి

వెంగళరావునగర్/చిక్కడపల్లి, మార్చి 28: విద్యుత్ ఉద్యోగిపై దాడి ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, షేక్‌పేటకు చెందిన కొట్టం భాస్కర్ (49) ఎర్రగడ్డ జీటీఎస్ కాలనీలోని విద్యుత్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సెక్షన్ అఫీసర్‌గా పని చేస్తుంటారు. బుధవారం మధ్యాహ్నం ఊబర్ బైక్ ద్వారా ఇంటి నుంచి తెప్పించే లంచ్ బాక్స్ తీసుకునేందుకు ఆఫీస్ మెయిన్ గేట్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడికి నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, నీ పేరు భాస్కరేనా అని అడిగి, ఔనని చెబుతుండగానే..ఆ నలుగురు మూక్కుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### దాడి చేసిన దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### బీఆర్ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్

వాటర్ వర్క్స్ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ అన్నారు. బాగ్ లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు యాదవ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణతో కలిసి మాట్లాడారు. వాటర్ వర్క్స్ మాదన్నపేట్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి సీహెచ్ రమేశ్ పై బుధవారం రెయిన్‌బజార్‌కు చెందిన ఓ వ్యక్తి దాడి చేశారని తెలిపారు. డ్రైనేజీలో నుంచి తీసిన మట్టిని తొలగించలేదని నెపంతో ఏ మాత్రం సంబంధం లేని రమేశ్ దాడి చేశారని తెలిపారు. ఇది ఇలా ఉండగా, బాధితుని పక్షాన నిలబడాల్సిన బాధ్యత యూనియన్ నాయకులపై ఉంటుందని చెప్పారు. ఐఎన్‌టీయూసీ అనుబంధం సంఘం జల మండలి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సి.సతీశ్ మాత్రం దాడి చేసిన వ్యక్తిని తప్పించే విధంగా రాజీ కుదుర్చడం దారుణమన్నారు. ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్

### జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, ఏఆర్ఓలకు పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందించడం, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనలు, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రొనాల్డ్ రాస్ సూచించారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఫారం - 12 అందించి, పోస్టల్ బ్యాలెట్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసే విధంగా ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు ఉన్న వారికి, ఇతర జిల్లాలో పని చేస్తూ హైదరాబాదు జిల్లాలో ఓటు హక్కు ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ స్పెషల్ క్యాజువల్ లీవ్ వెసులుబాటు కల్పించిందన్నారు. నిబంధనల మేరకు ఆయా ప్రక్రియ పూర్తి చేయాలని, ఎన్నికల విధులలో ఉన్న అధికారులు సిబ్బంది అంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యపర్చాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, జీహెచ్ఎంసీ ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, ఏఆర్ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు హక్కును వినియోగించుకోవాలి

### స్వీప్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ లీడర్స్, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిధులు, థర్డ్ జెండర్, ట్రాన్స్ జెండర్స్ ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు వేయడం బాధ్యతగా భావించాలని రొనాల్డ్ రాస్ తెలిపారు. ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలన్నారు. నమోదు కాని వారు ఏప్రిల్ 15 వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటరు జాబితాలో తమ పేరున్నది, లేనిది చూసుకోవాలన్నారు. ఆయా సంఘాల ప్రతినిధులు ఓటింగ్ శాతం పెంచడంపై కృషి చేయాలని రొనాల్డ్ రాస్ కోరారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు, విద్యార్థుల ద్వారా వారి కుటుంబంలో ఓటు వేయడంపై అవగాహన కల్పించాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి, ఆయా అధికారులు ఎన్నికల్లో సీనియర్ సిటిజన్స్‌కు, దివ్యాంగ ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించారు. వారికి సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండేలా చర్యలు చేపట్టాలని, ర్యాంప్ సదుపాయం, మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని, వీరికి సెపరేట్ క్యూలైన్/ ప్రాధాన్యతనిచ్చి ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేరుగా తీసుకెళ్ళి ఓటు వేయించాలని, ప్రతి లొకేషన్‌లో సరిపడినన్ని వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలని రొనాల్డ్ రాస్ తెలిపారు. 85 ఏండ్లు పై బడిన వయో వృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఫారం-12డీ కింద దరఖాస్తు చేసుకుంటే ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏసీ యూసీడీ చంద్రకాంత్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి, జేసీ పీడబ్ల్యూడీ నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌజన్య, ఎన్నికల వ్యయ పరిశీలకులు శరత్ చంద్ర, అసిస్టెంట్ స్వీప్ నోడల్ అధికారులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, దివ్యాంగుల అసోసియేషన్, ట్రాన్స్ జెండర్, థర్డ్ జెండర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓయూ అకాడమిక్ సెనేట్ సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ప్రొఫెసర్ వి.అప్పారావు, చిత్రంలో వీసీ రవీందర్ యాదవ్, సభ్యులు

# 44.68 కోట్ల లోటుతో ఓయూ బడ్జెట్

### బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు

### 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.796.45 కోట్లతో ప్రతిపాదనలు

### 93.7 శాతం నిధులు వేతనాలు, పెన్షన్లకే..

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 28: ఉస్మానియా యూనివర్సిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన వార్షిక బడ్జెట్‌ను గురువారం నిర్వహించిన అకాడమీ సెనేట్ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఓయూ బడ్జెట్‌లో మొత్తం ఆదాయం రూ.718.86 కోట్లుగా చూపెట్టారు. గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ. 32.91 కోట్ల ఓపెనింగ్ బ్యాలెన్స్‌తో కలిపి మొత్తం రూ.751.77 కోట్ల నిధులు అందుబాటులో ఉండగా, వ్యయం రూ.796.45 కోట్లుగా చూపెట్టారు. రూ.44.68 కోట్ల లోటుతో బడ్జెట్‌ను ఆమోదించారు. ఇందులో ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ రూ.487.03 కోట్లు, మిగిలిన నిధులను యూనివర్సిటీ అంతర్గతంగా సమకూర్చుకోనుంది. ఓయూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో అకాడమిక్ సెనేట్ జరిగిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ నివేదికలో గత సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, తీసుకున్న ప్రత్యేక చర్యలు, తదితర వాటిని వివరించారు. యూనివర్సిటీ నిర్వహించనున్న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ల గురించి పేర్కొన్నారు. అనంతరం ఓయూ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకాభిప్రాయంతో ఆమోదించారు. ఓయూకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నుంచి రూ.487.03 కోట్ల బ్లాక్ గ్రాంట్ మంజూరు కాగా, గతేడాది ఓపెనింగ్ బ్యాలెన్స్ రూ.32.91 కోట్లుగా ఉంది. యూనివర్సిటీ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్ బకాయిలు చెల్లించేందుకు ప్రత్యేక గ్రాంటు రూపంలో ప్రభుత్వం నుంచి రూ.55.00 కోట్లు మంజూరైంది. మిగిలిన మొత్తం వర్సిటీ భరించాల్సి ఉంటుంది. ఇందులో రూ.35.63 కోట్లు అంతర్గత ఆదాయాల ద్వారా, ఎగ్జామినేషన్ బ్రాంచ్, యూనివర్సిటీ ఫారెన్ రిలేషన్స్ ఆఫీస్, పీజీఆర్ఆర్‌సీడీఈ, డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అడ్మిషన్స్, డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్, టీఎస్‌పీజీఈటీ కన్వీనర్ తదితర సంస్థల నుంచి నిధుల మళ్లింపు ద్వారా రూ.138.50 కోట్లు, లోన్లు, అడ్వాన్సుల వసూల ద్వారా రూ.2.70 కోట్లు సమకూర్చుకుంటామన్నారు. మొత్తం బడ్జెట్‌లో అధ్యాపకులు, ఉద్యోగుల వేతనాలకు రూ.451.28 కోట్లు కాగా, పెన్షన్లకు రూ.295.00 కోట్లు కేటాయించారు. అదే విధంగా ఆకస్మిక అవసరాలకు రూ.47.17 కోట్లు, ఉద్యోగుల లోన్లకు రూ.3.0 కోట్లు కేటాయించారు.

### బడ్జెట్‌లో సింహ భాగం వేతనాలు, పెన్షన్లే..

యూనివర్సిటీ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో సింహ భాగం ఉద్యోగుల వేతనాలు, పదవీ విరమణ చేసిన వారి పెన్షన్లకే సరిపోతోంది. ఉద్యోగుల వేతనాలకు రూ.451.28 కోట్లు అవసరముండగా, ఇది వర్సిటీ మొత్తం బడ్జెట్‌లో 56.66 శాతం కావడం గమనార్హం. అదే విధంగా పెన్షన్లకు మరో రూ.295.00 కోట్లు కేటాయించగా, ఇది 37.04 శాతంగా ఉంది. మిగిలిన దాన్లో 5.92 శాతం కాంటింజెన్సీకి, 0.38 శాతం ఉద్యోగుల రుణాలకు కేటాయించారు. అయితే, వేతనాలు, పెన్షన్లకు మొత్తం బడ్జెట్‌లో 93.7 శాతం పోతోంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఈ శాతం 65.75గా ఉండగా, ఉద్యోగులకు వేతనాలు పెరిగిన దృష్ట్యా వర్సిటీపై మరింత భారం పడింది.

# నంబర్ ప్లేట్ల జాప్యంపై ఆర్టీఏ దృష్టి

### ఆలస్యం జరగకుండా అధికారుల చర్యలు

సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): వాహనాలకు నెంబర్ ప్లేట్లు జారీ చేయడంలో ఆలస్యం ఏర్పడుతున్నదని వాహనదారుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఆర్టీఏ అప్రమత్తమైంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక 20 రోజులు గడిచినా నెంబర్ ప్లేట్స్ రావడం లేదని కొందరు వాపోతున్నారు. గతంలో గ్రేటర్‌లోని ఖైరతాబాద్, సికింద్రాబాద్, బహదూర్‌పురా, మలక్‌పేట, ఉప్పల్, కొండాపూర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ ప్రాంతీయ ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు తెరిచి నంబర్ ప్లేట్లను బిగించేవాళ్లు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ల కోసం ద్విచక్ర వాహనానికి రూ.245, కారుకు రూ.600 వసూలు చేసేవాళ్లు. నంబర్ ప్లేట్ తయారైన తర్వాత వాహనదారుడి మొబైల్‌కు మెస్సేజ్ వచ్చేది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా కార్యాలయాలో ఈ ప్లేట్లను బిగించేవాళ్లు. అయితే, ఈ బాధ్యతలను షోరూంలకు అప్పగించారు. ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనదారుల క్యూ లైన్ల దృష్ట్యానే షోరూంలకు అప్పగించినట్టు అధికారులు తెలిపారు. గ్రేటర్‌లో రోజుకు రెండు వేల వాహనాల వరకు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. ఇందులో 16 వందల వరకు ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలు ఉంటున్నాయి. ఈ లెక్కన ఒక్క నగరం నుంచి రోజూ లక్షల్లోనే సదరు సంస్థకు ఈ ప్లేట్ల రూపేణా ఆదాయం సమకూరుతుంది. షోరూంలు విడుదల చేయాల్సిన సమయం మూడు రోజుల్లోనే ఉంటుంది. కొన్ని పరిస్థితుల్లో వారం రోజుల్లోపైనా నెంబర్ ప్లేటు రావాల్సి ఉంటుంది. కానీ, నిర్ణీత సమయానికి నెంబర్ ప్లేట్లను షోరూంలు అందించకపోవడంతో సదరు సంస్థలతో ఆర్టీఏ అధికారులు సమావేశాలు నిర్వహించి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బద్రి విశాల్ పన్నాలాల్ సేవలు వెలకట్టలేనివి

### ఘనంగా బద్రి విశాల్ 96వ జయంతి వేడుకలు




బంజారాహిల్స్, మార్చి 28: ప్రముఖ సామాజికవేత్త దివంగత బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టీ సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు అన్నారు. బద్రి విశాల్ 96వ జయంతి వేడుకలు బంజారాహిల్స్‌లోని తాజ్ డక్కన్ హోటల్‌లో గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మారకోపన్యాసంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. స్వతంత్ర సమరయోధుడిగా, సోషలిస్ట్ నాయకుడిగా హైదరాబాద్‌లో కీలక భూమిక పోషించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలకు, సమాజంలో అణిచివేతకు గురైన వారికి అండగా నిలబడిన ఘనత బద్రి విశాల్ పిట్టీకి దక్కుతుందన్నారు. బద్రి విశాల్ పిట్టీ చూపిన దారిలోనే ఆయన కొడుకు శరత్ పిట్టీ నడుస్తూ బద్రి విశాల్ పన్నాలాల్ ట్రస్ట్ నడిపిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బద్రి విశాల్ పన్నాలాల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శరత్ పిట్టి, లక్ష్మి నివాస్ శర్మ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందంతో వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి, సంస్థ ప్రతినిధులు

## జేఎన్టీయూహెచ్‌తో వాధ్వని ఎంఓయూ

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 28: జేఎన్టీయూహెచ్ వర్సిటీలో ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నేషనల్ ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ నెట్‌వర్క్ (ఎన్ఈఎన్) బెంగళూరు, కర్ణాటక సంస్థతో జేఎన్టీయూహెచ్ వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం, ఉపాధ్యాయులు, విద్యార్థులకు వ్యవస్థాపక నైపుణ్యాలు, మనస్తత్వాన్ని పెంపొందించడం, ఆచరణాత్మక అవగాహనతో శక్తిమంతం చేయాల్సి ఉంటుంది. వాధ్వని సంస్థ వర్సిటీలో చదువుతున్న విద్యార్థుల ఆలోచనకు తగిన శిక్షణలివ్వడం విద్యార్థుల ఆలోచనకు పదనుపెట్టి వారిచేత స్టార్టప్ కంపెనీల ఏర్పాటుకు ఉచితంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సంస్థ దేశంలో పలు యూనివర్సిటీలలో, ఎన్ఐటీలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు, ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ డైరెక్టర్ ఆర్.శ్రీదేవి, వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.వెంకటరమణ, పీఆర్వో ప్రసన్నలు, నేషనల్ ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ నెట్‌వర్క్ ప్రాంతీయ డైరెక్టర్ సోనాలి అగ్నిహోత్రి, ప్రోగ్రామ్ మేనేజర్ అమిత్‌సింగ్‌లు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

## ఆర్టీఏలో ఇఫ్తార్ విందు

ఖైరతాబాద్ ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జేటీసీ ప్రవీణ్ రావు, హైదరాబాద్ జేటీసీ సి.రమేశ్, సికింద్రాబాద్ ఆర్టీఓ శ్రీనివాస రెడ్డి, ఖైరతాబాద్ ఆర్టీఓ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.
– సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ)

## సాహిత్య విమర్శపై అధ్యయన శిబిరం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 28: సాహిత్య విమర్శపై తెలంగాణ సారస్వత పరిషత్తు త్వరలో అధ్యయన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య గురువారం తెలిపారు. ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో విమర్శకు ఎంతో ప్రాధాన్యం ఉన్న దృష్ట్యా విమర్శ చేసే వారికి తగిన అవకాశం కల్పించడం కోసం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విమర్శ, విమర్శకుడు, విమర్శ రీతులు, ఆధునిక సాహిత్య విమర్శ వికాసం, వ్యాఖ్యానం, సమీక్ష, సాహిత్య చరిత్ర, పరిశోధన భేదం సాదృశ్యాలు, విమర్శ ధోరణులు తదితర అంశాలపై ప్రముఖ సాహిత్య విమర్శకులు ప్రసంగాలు చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు తక్షణమే ఫోన్ నం: 96037 27234కు వాట్సప్ ద్వారా తమ వివరాలను పంపి పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

## నీల్‌కమల్ బ్రాండ్ అంబాసిడర్‌గా రణబీర్ కపూర్

సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ప్రముఖ స్లీపింగ్ మ్యాట్రెస్ నీల్‌కమల్ స్లీప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఫర్నీచర్ రంగంలో గడిచిన 30 ఏండ్లుగా మెరుగైన సేవలు అందిస్తున్నామని, రణబీర్ నియామకంతో తమ బ్రాండ్‌కు మరింత గుర్తింపు వస్తుందని కంపెనీ పేర్కొంది. భారతీయ అవసరాలకు అనుగుణంగా సుఖవంతమైన నిద్రను అందించడంలో తమ ఉత్పత్తులు ఎంతగానో సహకరిస్తాయని, నేటి తరానికి చేరువయ్యేలా రణబీర్ కపూర్ ప్రచారం తమకు మరింత కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## దివ్యాంగులకు 30న బస్సు పాసు మేళా

సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మనోహరాబాద్ మండల కార్యాలయంలో ఈ నెల 30న దివ్యాంగుల బస్సు పాసుల స్పెషల్ క్యాంప్ మేళాను నిర్వహిస్తామని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు గురువారం పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగులకు బస్సు పాసులు జారీ చేస్తామని ఆయన తెలిపారు. మనోహరాబాద్, పాలాట, ధర్మరాజుపల్లి, కునాయిపల్లి, కూచారం, పోతారం, జీడిపల్లె, దండుపల్లి, లింగారెడ్డి పేట్, చాట్ల గౌరారం, కొండాపూర్, పరికి బండ, రామాయపల్లి, రంగాయిపల్లి, ముప్పిరెడ్డి పల్లి, అగ్రహారం తదితర పరిసర ప్రాంతాల్లో నివసించే దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగులు వారితో పాటు ఒక పాస్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఐడీ కార్డు, సర్వీస్ ఛార్జ్ రూ.50 తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు.

## నగరంలో రవీనా సందడి

మెహిదీపట్నం గుడి మల్కాపూర్ కింగ్ ప్యాలెస్‌లో టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా ఏర్పాటు చేసిన రంజాన్ ఫెస్టివల్‌ను బాలీవుడ్ హీరోయిన్ రవీనాటాండన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. రంజాన్ ఫెస్టివల్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. – మెహిదీపట్నం మార్చి 28